సాక్షి జనగామ

మంగళవారం । 18 । మార్చి । 2025



వర్సిటీల అభివృద్ధికి నిధులు..

రాష్ట్ర పరిధిలోని ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధికి, పరిశోధనకు కేంద్రం నిధులు కేటాయించాలని వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు.

- 8లో▸



అడ్డదారి లైసెన్స్‌లకు చెక్

అడ్డదారుల్లో తీసుకుంటున్న డ్రైవింగ్ పరీక్ష పద్ధతికి రవాణాశాఖ అధికారులు చెక్ పెట్టనున్నారు. కొత్త పరీక్ష తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

- 8లో▸


గరిష్టం/కనిష్టం


39.5^0 / 20.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, వడగాలులు వీస్తాయి. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

ఏడాదంతా చదివింది ఒక ఎత్తయితే.. దాన్ని పరీక్షల్లో ప్రజెంట్ చేయడం మరో ఎత్తు.. కొందరు విద్యార్థులు బాగా చదువుతారు. తీరా పరీక్ష సమయానికి మరిచిపోతుంటారు.. మరికొందరేమో ఎంత చదివినా హ్యాండ్ రైటింగ్ బాగోలేక మార్కులు కోల్పోతారు.. ఇంకొందరైతే పరీక్ష అంటే గాబరా పడిపోయి ప్రశ్నలకు సమాధానం తెలిసినా నిర్ణీత సమయంలో రాయలేకపోతారు.. ఇలా చాలా మంది విద్యార్థులు ఏదో ఒక సమస్యతో బాధపడేవారే. వీరంతా మంచి మార్కులు సాధించేందుకు, పరీక్షలను ఈజీగా రాసేందుకు సబ్జెక్టు నిపుణులు సూచనలిస్తున్నారు. ఈనెల 21 నుంచి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. మంచి మార్కులు సాధించడానికి ఆయా సబ్జెక్టుల నిపుణులను 'సాక్షి' పలకరించింది. విద్యార్థుల కోసం వారు తమ సూచనలు, సలహాలు వెల్లడించారు. - మహబూబాబాద్ అర్బన్





వివరాలు 8లో▸

విజయీభవ!

'పది' ఫలితాలకు ప్రణాళికే కీలకం

- చక్కని రాతతో మార్కుల స్కోరింగ్
- పదో తరగతి పరీక్షల నేపథ్యంలో.. విద్యార్థులకు సబ్జెక్టు నిపుణుల సూచనలు

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

పదో తరగతి వార్షిక పరీక్షలు మరో మూడ్రోజుల్లో ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి. బాగా చదివాను.. పరీక్షలు బాగా రాస్తాను.. అనే భావనతో వెళ్లాలి. నెగెటివ్ ఆలోచనలను దరిచేర నీయొద్దు. గతంలో సాధించిన విజయాలను గుర్తు చేసుకోవాలి. టీవీ, సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు వహించాలి. ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ జోలికి వెళ్లొద్దు. సాత్విక ఆహారం తీసుకుంటే తొందరగా జీర్ణమవుతుంది. తగినంతగా నీరు తాగాలి. ఎవరైనా ఒత్తిడికి లోనైనా.. పరీక్షలంటే భయం కలిగినా 93911 17100, 94408 90073 నంబర్లకు ఫోన్ చేస్తే తగిన సూచనలిస్తాం.



- పోగు అశోక్, తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి



న్యూస్‌రీల్

సోమేశ్వరాలయంలో భక్తుల సందడి



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని ధర్మకంటలోని కోఎడ్యుకేషన్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, సీసీ కెమెరాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వసతి, మెడికల్ సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఐఈఓ జితేందర్‌రెడ్డి, అధికారులు ఉన్నారు. కాగా సోమవారం జరిగిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 4,678 మంది విద్యార్థులకు గాను 4,440 మంది హాజరు కాగా 238 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ విద్యాధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు.

'దేశాభివృద్ధికి జమిలి ఎన్నికలే మేలు'



జనగామ రూరల్: దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే జమిలి ఎన్నికల నిర్వహణతోనే సాధ్యం అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ ప్రజ్ఞురి లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యం పటిష్టంగా క్షేత్రస్థాయి నుంచి బలపడాలంటే జమిలి ఎన్నికలే శరణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఎల్ఎన్ రెడ్డి, శోభన బోయిన శివరాజ్ యాదవ్, దుబ్బ రాజశేఖర్, కొంతం శ్రీనివాస్, పూసాల శ్రీమాన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ధాన్యం దిగుబడి

- కరువు కాటేసింది.. పంట తగ్గింది
- వానాకాలంలో 55 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- లక్ష్యం 20 లక్షల క్వింటాళ్లు.. సేకరణ 9.10 లక్షలే..
- బోనస్ కోసం అన్నదాతల ఎదురుచూపులు
- యాసంగి సీజన్‌కు యాక్షన్ ప్లాన్‌కు సన్నద్ధం





జనగామ: వానాకాలం సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలతో ధాన్యం దిగుబడి తగ్గింది. సాగునీటి కొరత రైతులను వెంటాడింది. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించింది. 25 లక్షల క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పొట్టదశలో చీడపీడలు, కోత దశలో వడగళ్లు, అకాల వర్షాలు 40 శాతం పంటను నాశనం చేసింది. జిల్లాలో 2 లక్షల ఎకరాలకు పైగా వరి సాగు చేయగా, 55 వేల పైచిలుకు ఎకరాల పరిధిలో పంట దెబ్బతింది. అకాల వర్షాల భయంతో చాలా మంది రైతులు పచ్చి మీదనే కోతలు మొదలు పెట్టి, 30, 40 శాతానికి పైగా తేమతో ధాన్యం గింజలను మార్కెట్‌కు తరలించారు. ప్రభుత్వం అప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో క్వింటాకు మద్దతు ధర కంటే రూ.200 నుంచి రూ.400 వరకు తక్కువకు అమ్ముకున్నారు. కోతలు మొదలైన 20 రోజుల తర్వాత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులో తీసుకురాగా, అప్పటికే ప్రైవేట్‌లో 6 లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం కొనుగోళ్లు జరిగాయి.

25 లక్షల క్వింటాళ్ల దిగుబడి అంచనా..

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 20 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు లక్ష్యంగా ప్రభుత్వం రంగంలోకి దిగింది. ప్రకృతి వైపరీత్యాలతో 55 వేల ఎకరాలకు పైగా పంటపై తీవ్ర ప్రభావం చూపించింది. మొత్తంగా 25 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేయగా, సుమారు 5 లక్షల క్వింటాళ్ల మేర దిగుబడి తగ్గగా, ప్రైవేట్‌తో పాటు ఎక్స్‌పోర్టులో 8 లక్షల వరకు కొనుగోళ్లు జరిగాయి. దిగుబడి అంచనా మేరకు 20 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యంగా రంగంలోకి దిగారు. సుమారు నెల రోజులకు పైగా కొనుగోళ్లు జరిగాయి. జిల్లాలో 17,391 మంది రైతుల వద్ద దొడ్డు, సన్న రకానికి చెందిన ధాన్యం 9.10లక్షల (9,10,043 మెట్రిక్ టన్నులు) క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డురకం 6,22,061 క్వింటాళ్లు, సన్నరకం 2,87,082 క్వింటాళ్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ మొత్తానికి రూ.211.21 కోట్లకు గాను వందశాతం చెల్లింపులు పూర్తయ్యాయి. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చొప్పున రూ.14.39 కోట్లు ఇవ్వాల్సి ఉంది. దీంట్లో ఇప్పటి వరకు రూ.14.18 కోట్లు ఇవ్వగా, ఇంకా రూ.21.21 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో రైతులకు బోనస్ డబ్బుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. రైతుల వద్ద కొనుగోలు చేసిన సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని సీఎంఆర్ కోసం రైస్‌మిల్లులకు తరలించారు.

దిగుబడి తగ్గింది



ఖరీఫ్ సీజన్‌లో నాలుగున్నర ఎకరాల్లో సన్నరకం ధాన్యం సాగు చేశా. 120 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 106 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. తిడుగు ఐకేపీ కేంద్రంలో అమ్ముకున్నా. ప్రభుత్వం చెప్పినట్టుగా క్వింటాకు రూ.500 బోనస్ చొప్పున, రూ.53 వేలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్కపైసా రాలేదు. నాలుగు నెలల నుంచి బోనస్ కోసం ఎదురుచూస్తున్న. అధికారుల నుంచి ఎటువంటి సమాధానం లేదు.

- మారంరెడ్డి శౌరెడ్డి, రైతు, సాగరం, జఫర్‌గఢ్

బోనస్ రాలే..



ప్రభుత్వ ఐకేపీ సెంటర్‌లో 47 క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని విక్రయించా. ఇప్పటి వరకు ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ క్వింటాకు రూ.500 రాలేదు. రెండున్నర నెలలుగా అధికారులను అడిగినా.. సరైన సమాధానం లేదు. మళ్లీ సన్నధాన్యం ఎలా సాగు చేస్తాం.

- గంగుల అనంతరెడ్డి, రైతు, రామచంద్రగూడెం, లింగాలఘణపురం

కొనుగోళ్లు పూర్తి

జిల్లాలో 181 సెంటర్ల ద్వారా 9.10 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశాం. ఈ మొత్తాన్ని సీఎంఆర్ కోసం రైస్‌మిల్లులకు పంపించాం. రైతుల ఖాతాల్లో రూ.211 కోట్లు జమ చేయగా, సన్నరకం బోనస్ కింద రూ.14.18 కోట్లు ఇవ్వగా, ఇంకా రూ.21.21లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కూడా త్వరలోనే వస్తాయి.

- హథిరామ్, సివిల్ సప్లయీస్ డీఎం

ఆందోళనకు గురికావొద్దు

- ప్రశాంతంగా పరీక్షలు రాయాలి
- జిల్లా, మండల టాపర్లకు బహుమతులు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: రానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దని, ప్రశాంతంగా రాయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న టెన్త్ పరీక్ష నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు ప్రతీ విద్యార్థి హాజరయ్యేలా ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంపై కూడా తగిన శ్రద్ధ వహించాలని, తగినంత వ్యాయామం, మంచి పోషకాహారం, నిద్ర కూడా తగినంత ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. పరీక్షలకు వెళ్లబోయే చివరి వారం రోజుల్లో కొత్త విషయాలు చదవకుండా చదివిన విషయాలని మళ్లీ రివిజన్ చేసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి పరీక్షకు హాజరు అయ్యేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా, మండలాల్లో టాప్ స్కోర్ సాధించిన విద్యార్థికి సైకిల్ బహుమతిగా ఇస్తామన్నారు. వందశాతం ఫలితాలు సాధించిన పాఠశాలలకు కూడా ప్రత్యేక అవార్డులు ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీఈఓ రమేశ్, ఏసీజీ రవికుమార్, గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడితో తలొగ్గిన ప్రభుత్వం

- రేపు దేవాదుల మూడో ఫేజ్ బటన్ ఆన్ చేయనున్న మంత్రి
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: ఎండుతున్న పంటలకు సాగునీరు అందించి ఆదుకోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి ఫలితంగానే దేవాదుల థర్డ్ ఫేజ్ బటన్‌ను ఆన్ చేయనున్నట్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయన మాట్లాడుతూ దేవన్నపేట నుంచి ధర్మసాగర్‌కు వచ్చే థర్డ్ ఫేజ్‌ను ఈ నెల 19న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆన్ చేయనున్నట్లు స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా తపాస్‌పల్లి, గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, లద్నూర్ రిజర్వాయర్లను నింపి జనగామ నియోజకవర్గంలోని ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు ఇవ్వాల్సిన ప్రభుత్వం, పంట కోత దశకు వచ్చి ఎండుతున్నా.. పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజన్‌లో 60 రోజుల్లో కేవలం 40 రోజులు మాత్రమే పంపులను నడిపించడం బాధాకరమన్నారు. జనగామ నియోజకవర్గంలోని దేవాదుల ఆయకట్టు పరిధిలో 50 శాతం మేర పంట పూర్తిగా ఎండిపోయిందన్నారు. పంటల పరిస్థితిపై రైతులు ప్రతిరోజు తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు జిల్లా ఇరిగేషన్ అధికారుల నుంచి ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అసెంబ్లీ వేదికగా ఇక్కడి దయనీయ పరిస్థితులను వివరించడం జరిగిందన్నారు. జనగామ నియోజకవర్గంలోని రిజర్వాయర్లు, చెరువులను నింపి భూగర్భ జలాల పెంపుపై దృష్టి సారించాలన్నారు. కరువు నేపథ్యంలో ఎండిన ప్రతీ ఎకరాకు ప్రభుత్వం తరఫున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కనకారెడ్డి

జనగామ రూరల్: జిల్లాలో ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో అహల్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే యాసంగి పంటలు ఎండిపోయాయన్నారు. ఇప్పటికైనా జిల్లాలోని ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకుపోయి పంటలు ఎండిన రైతులకు ఎకరాలకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేశ్, రాపర్తి సోమయ్య బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, ఉపేందర్ బెల్లంకొండ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నిఖిల్ శ్రీవల్లి

పాలకుర్తి టౌన్: ఈ నెల 23న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ మామిండ్ల సోమయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన గుంజె శ్రీవల్లి, లకావత్ నిఖిల్ ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు హెచ్‌ఎం పాయం శోభారాణి, ఉపాధ్యాయులు ఓరుగంటి రమేశ్, గుగులోతు బలరాం, అశోక్ కుమార్, మరియా, జత్పత, రవి, నరసింహమూర్తి, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

ప్రజలను మోసం చేసేందుకు కుట్ర

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న పెరుమాండ్ల వెంకటేశ్వర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గ ప్రజలను మరోసారి దగా చేసేందుకు సీఎంతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుట్ర చేస్తూ అభివృద్ధి పనులు అంటూ ప్రజలను మభ్యపెడుతున్నాడని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం శివునిపల్లిలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో ఎంపీ, ఎమ్మెల్సీ, ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కనిపించలేదా అని ప్రశ్నించారు. మామునూరు ఎయిర్ పోర్టు గురించి మాట్లాడుతున్నారని, గతంలో కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని గుర్తించాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి గోనెల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రడపాక ప్రదీప్, నాయకులు ఇల్లందుల సారయ్య, కుమ్మం సతీష్, గోనెల శివకృష్ణ, తాళ్లపెల్లి శ్రీనివాస్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతోనే ఉజ్వల భవిష్యత్

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి
- ఘనంగా ఇంజనీరింగ్ కాలేజీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డే

కేయూ క్యాంపస్ : ప్రతిభతోనే ఇంజినీరింగ్‌లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. సోమవారం రాత్రి కాకతీయ యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజినీరింగ్ కాలేజీ వార్షికోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డేను ఘనంగా నిర్వహించారు. అతిథులు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో ఇంజినీరింగ్ యువత 40శాతం మంది ఉద్యోగ, ఉపాధి రంగాల్లో దూసుకుపోతున్నారని తెలిపారు. జాతీయ హాకీ జట్టు రిటైర్డ్ కోచ్ మధుచరణ్ మాట్లాడుతూ యువత సక్సెస్‌కు చదువుతోపాటు క్రీడలు కూడా అత్యంత ప్రాధాన్యత వహిస్తాయని తెలిపారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ మాట్లాడారు. వివిధ క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కల్చరల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతోపాటుగా ఆధునిక డ్యాన్స్‌లతో హోరెత్తించారు. అధ్యాపకులు సీహెచ్ రాధిక, ఆసిం ఇక్బాల్, వి.మహేందర్, శ్రీధర్ కుమార్, సుమలత, దాసరి శైలజ, రాజేశ్వరి, పర్వీన్,శిరీష బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ తదితరులు

వర్గీకరణ ప్రకారమే నియామకాలు చేపట్టాలి



జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టేలా మార్గదర్శకాలు విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హక్కుల సాధనకు కలెక్టరేట్ వద్ద చేట్టిన దీక్షలు సోమవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బొట్ల మహేశ్, గద్దల కిశోర్, రాజశేఖర్, గువ్వల రవి, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తరిగొప్పుల: మండలంలోని అంకుషాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బంజరుపల్లిలో నీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గత 15 రోజులుగా నల్లాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. స్పందించడం లేదని, కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా నీరు లేదన్నారు. సమీప వ్యవసాయ, బోరు బావుల వద్ద నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలి

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ లోడ్ పెరిగే అవకాశం ఉన్న అన్ని చోట్ల అన్ని సర్కిళ్ల పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏ ర్పాటు చేశామన్నారు. ఇంటర్ లింకింగ్ పనులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పా టు, వీసీబీల ఏర్పాటు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్ఈలను ఆదేశించారు. ఏప్రిల్‌లో పంట కోతలు పూర్తి కాగానే వ్యవసాయ సర్వీసుల త్వరితగతిన రిలీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, సీఈలు తిరుమల్‌రావు, రాజు చౌహాన్, అశోక్, బీకం సింగ్, వెంకటరమణ, డీఈ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి జైలు

గణపురం: పోక్సో కేసులో ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ భూపాలపల్లి ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు సోమవారం తీర్పు వెలువరించారు. 2020 సంవత్సరంలో గణపురం మండలం దుబ్బపల్లికి చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన మోతె రవీందర్ వేధించగా బాలిక ఈ విషయం తన తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ సమయంలో రవీందర్ భార్య సునీత.. బాలికను, ఆమె తల్లిదండ్రులను దూషిస్తూ వారిపై దాడి చేయగా బాలిక తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటి ఎస్‌హెచ్ఓ ప్రభాకర్ పోక్సో కేసు నమోదు చేయగా అప్పటి ఎస్సై సత్యనారాయణ రాజు చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కోర్టు స్పెషల్ పీపీ విష్ణువర్ధన్ వాదనలు వినిపించారు. ప్రస్తుత సీఐ మల్లేశ్, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో కోర్టు లైజనింగ్ అధికారి, ఏఎస్సై గాండ్ల వెంకన్న, కోర్టు కానిస్టేబుల్ శ్వేత సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువుకావడంతో భూపాలపల్లి ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు నిందితులకు సంవత్సరం జైలు, రవీందర్‌కు రూ.4,500, సునీతకు రూ.1,500 జరిమానా విధించారు.

గంజాయి కేసులో ఒకరికి పదేళ్లు..

రేగొండ: గంజాయి కేసులో ఒకరికి పది సంవత్సరాల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు సోమవారం తీర్పు వెలువరించారు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపల్లిగోరి మండలం నిజాంపల్లి గ్రామానికి చెందిన వంగల రాజన్న ఇంట్లో గంజాయి ఉందనే సమాచారం మేరకు 2019లో అప్పటి ఎస్సై సధాకర్ సోదాలు నిర్వహించి 25 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి సీఐ సాయిరమణ విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. అనంతరం చిట్యాల సీఐ పులి వెంకట్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ మల్లేశ్, ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి జ్యోతి.. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్ వాదనలు విని పించారు. కేసు పూర్వాపరాలు విచారించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు.. నిందితుడికి పది సంవత్సరాల జైలు శిక్ష రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

20న జాబ్ మేళా

హన్మకొండ అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు ఈనెల 20న(గురువారం) జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎం.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో వర్చువల్ సెల్స్ ఎగ్జిక్యూటివ్, యాక్సిస్ బ్యాంక్‌లో బిజినెస్ డెవెలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ 20 పోస్టుల భర్తీకి ములుగు రోడ్డు ప్రభుత్వ ఐటీఐ బాయ్స్ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు 18–35 ఏళ్ల లోపు ఉండాలని, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న యువతీ యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అడ్డదారి లైసెన్స్‌లకు చెక్

వాహనం సరిగా నడపగలిగితేనే లైసెన్స్.. లేదంటే అంతే

స్మార్ట్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటుకు ప్రణాళికలు రెడీ

- ట్రాక్‌పై డ్రైవింగ్ పరీక్ష పద్ధతికి స్వస్తి
- ఉమ్మడి జిల్లాలో అన్ని ఆర్టీఏల్లో స్థలాల సేకరణకు చర్యలు
- ఇప్పటికే ఆయా కలెక్టర్లకు ఆర్టీఓల వినతి



ఆర్టీఏ కార్యాయాల్లో నిర్మాణం కానున్న అధునాతన డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నమూన

ఖిలా వరంగల్ : రహదారులపై ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా వాహనాలు. లక్షలాది సంఖ్యలో బైకుల.. వేలాది సంఖ్యలో కార్లు కనిపిస్తున్నాయి. అయితే వీటన్నింటినీ నడిపే వారికి లైసెన్స్ ఉందా అంటే.. కొందరికి మాత్రమే ఉంటోంది. మరికొందరికి ఉండడం లేదు. మరి ఉన్నవాళ్లయినా సక్రమంగా తీసుకున్నారా అంటే.. బ్రోకర్ల ద్వారా అడ్డదారుల్లో తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో రవాణాశాఖ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి పాత విధానం ట్రాక్‌పై డ్రైవింగ్ పరీక్ష పద్ధతికి చెక్ పెడుతూ.. స్మార్ట్ సెన్సార్ కెమెరాల నిఘాతో అధునాతన ట్రాక్‌పై కొత్త పరీక్ష తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీని వల్ల అడ్డదారిలో లైసెన్స్‌లు తీసుకునే వాహనచోదకులకు చెక్ పడనుంది.


అడ్డదారులు మూత!

ప్రస్తుతం.. ప్రతి ఇంట్లో ద్విచక్రవాహనం తప్పని సరి అయ్యింది. కొన్ని ఇళ్లల్లో ఒకటికి మించి ఉంటున్నాయి. ఆర్థికంగా ఉన్న వారు కారు కూడా కలిగి ఉంటున్నారు. ఫలితంగా రోజు రోజుకూ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరిగిపోతున్నాయి. అందుకు నిదర్శనమే రహదారులపై పెరిగిపోతున్న ట్రాఫిక్ జామ్. కొంత మంది డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన లేకుండానే రోడ్డెక్కేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మరి వాళ్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండదా.. అంటే ఉంటుంది. కానీ అది అడ్డదారిలో తీసుకున్నదై ఉంటుంది. డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన లేకుండా వాహనాలతో రోడ్కెక్కడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకు అడ్డదారుల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందడమే కారణమని గ్రహించిన అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం కొత్త పరీక్ష ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు ఉన్న మ్యానువల్ పరీక్షను తీయడానికి నిర్ణయం తీసుకున్నారు.

ఆధునికతకు చర్యలు..

తాజాగా వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను ఆధునీకరించాలని ఆర్టీఏ అధికారులు నిర్ణయించారు. అందుకోసం ప్రస్తుతం కొనసాగుతున్న పాత విధానం కంటే మరింత ప్రామాణికంగా డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆటోమేటిక్ స్మార్ట్ సెన్సార్ డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించేందుకు స్థలాల సేకరణలో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో అడ్డదారిలో డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కష్టమే..

ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతి..



ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లిలో రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో వరంగల్‌లో తప్ప మరెక్కడా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ లేదు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలో ఆధునిక డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం వచ్చే వారికి వరంగల్ రవాణాశాఖ తనిఖీ అధికారులే పరీక్షలు నిర్వహించి లైసెన్స్‌లు అందజేసే పద్ధతి చాలాకాలం నుంచి కొనసాగుతోంది. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు వరంగల్ ఆర్టీఏకు 5 ఎకరాలు, మిగతా జిల్లాల్లో రోడ్డు పక్కాన 10 ఎకరాల స్థలాలు కావాలంటూ ఆర్టీఏ అధికారులు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇటీవల వినతి పత్రాలు అందజేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు కావాల్సిన స్థలాల కోసం పరిశీలిస్తున్నారు.

వాహనం నడిపితేనే లైసెన్స్..

త్వరలో అందుబాటులోకి తీసుకురానున్న కొత్త పద్ధతిలో రహదారులపై నిత్యం ఎదురువుతున్న ఇబ్బందులను డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌పై కృత్రిమంగా కల్పిస్తారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లు తప్పని సరిగా పరీక్ష రాయాల్సిందే.. ట్రాక్ మీద వాహనం నడిపిన తర్వాతే లైసెన్స్ పొందుతారు. అయితే ట్రాక్ మీద వాహనం నడిపేటప్పుడు కంప్యూటర్‌లో రికార్డవుతుంది. ఏదైనా చిన్న తప్పు చేసినా పరీక్ష ఫెయిల్ అయినట్లే..

కొత్త పద్ధతులు ఇలా..

కొత్తగా ఆర్టీఏ అమలు చేయబోయే ఆటో మెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పరీక్షలో 5 ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. ముందు 'హెచ్' అనే ట్రాక్‌లో ఆర్టీఏ ప్రమాణాల్లో పేర్కొన్న విధంగా వాహనాన్ని రివర్స్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత 'ఎస్' అనే ట్రాక్‌లో ఒక మూల నుంచి మరో మూలకు వాహనాన్ని టర్న్ చేయాలి. అలాగే 'కే' అనే ట్రాక్‌లో బాగా మలుపులు, ఎత్తు పల్లాలు, ఎత్తయిన ప్రదేశాలు, చిన్న లోయలు వంటింటి ఏర్పాటు చేస్తారు. ఆ ట్రాక్‌లో వాహనాన్ని నడిపి చివరిగా పార్కింగ్ చేసి చూపించాల్సి ఉంటుంది. అయితే ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలి. ఈ ప్రక్రియ అంతా కంప్యూటర్‌లో రికార్డవుతుంది. వాహనాన్ని నడిపేటప్పుడు ఎలాంటి పొరపాట్లు చేసినా కంప్యూటర్‌లో రికార్డు అవుతుంది. ఏ చిన్న మిస్టేక్ చేసినా టెస్ట్‌లో ఫెయిల్ అయినట్లు చూపిస్తుంది. ఒక వేళ పరీక్షలో ఫెయిలైతే మరో నెల పాటు శిక్షణ తీసుకుని రమ్మంటారు. పూర్తిగా కంప్యూటరీకరణ కావడం వల్ల ఇక్కడ అధికారులను సిబ్బందిని మేనేజ్ చేసేందుకు ఏమాత్రం అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. బ్రోకర్లకు కూడా ఎలాంటి అవకాశం ఉండదని చెబుతున్నారు. దీంతో అడ్డదారుల్లో లైసెన్స్ పొందడం ఇక కష్టతరం కానుంది.

ట్రాక్ స్థలం కోసం వినతిపత్రం అందజేశాం



అధునాతన డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ కోసం వరంగల్ ఆర్టీఏకు 5 ఏకరాల భూమి అవసరం ఉంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇటీవల కలెక్టర్‌ను కలిసి స్థలం కావాలని కోరుతూ వినతిపత్రం అందజేశాం. కలెక్టర్ సానుకూలంగా స్పందించి స్థలం ఇప్పించేందుకు చర్యలు తీసుకున్నారు.

– శోభన్‌బాబు, ఇన్‌చార్జ్ ఆర్టీఏ, వరంగల్

వర్సిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : రాష్ట్ర పరిధిలోని ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధికి, పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయొద్దని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం కేయూ సెనేట్‌హాల్‌లో 'యూజీసీ నూతన నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి' అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. యూజీసీ నూతన ముసాయిదాతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. అందుకే నూతన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో నాణ్యమైన విద్య బోధన జరగాలంటే సరిపడా అధ్యాపకుల నియామకాలు జరగాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్, కేయూ రిటైర్డ్ ఆచార్యుడు కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్.. యూనివర్సిటీల అభివృద్ధికి ఇచ్చే నిధులు బాగా తగ్గించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇచ్చే యూజీసీ ఫెలోషిప్స్, స్కాలర్‌షిప్స్‌లో కోత విధించిందన్నారు. యూజీసీ నూతన ముసాయిదాతో యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాలరాయడమేనని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నున్న అప్పారావు, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఇ. విజయ్‌కన్నా, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సాంబ, రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రీన్‌సుల్తానా పాల్గొన్నారు.

నేడు కోర్టు ముందుకు కొత్త హరిబాబు?

- అరెస్ట్ చూపించి కోర్టులో హాజరుపరుచనున్న పోలీసులు
- సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న సమయంలోనే పట్టుకున్న ఖాకీలు
- నిందితుడితో పాటు సహకరించిన మరో ఇద్దరు అదుపులోకి?



భూపాలపల్లి: సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో ఏ8గా ఉన్న భూపాలపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కొత్త హరిబాబును నేడు (మంగళవారం) పోలీసులు అరెస్ట్ చూపించనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 19న రాజలింగమూర్తి దారుణ హత్యకు గురికాగా, ఈ కేసులో నిందితుడి(ఏ8)గా ఉన్న హరిబాబు పరారీలో ఉండగా పోలీసులు వెతుకుతున్నారు. ఈ క్రమంలోనే హన్మకొండకు చెందిన అతడి సన్నిహితుడి క్రెడిట్ కార్డు తీసుకెళ్లి వినియోగించడంతో హరిబాబు శనివారం రాత్రి ఢిల్లీలో పట్టుబడగా కారులో భూపాలపల్లికి తీసుకురాగా సోమవారం తెల్లవారుజామున చేరుకున్నట్లు సమాచారం. అయితే సోమవారం హరిబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ఉన్న కారణంగా అరెస్ట్ చూపించలేదని తెలుస్తోంది. నేడు(మంగళవారం) జిల్లా కేంద్రంలో అరెస్ట్ చూపించి, కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం.

సుప్రీంకోర్టును ఆశ్రయించే యత్నం..

రాజలింగమూర్తి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కొత్త హరిబాబు ఈనెల 4న హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా, బెయిల్ వచ్చే అవకాశం లేదని గమనించి సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు యత్నించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే క్రెడిట్ కార్డు వినియోగం ఆధారంగా అతడిని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం.

పోలీసుల అదుపులో మరో ఇద్దరు..?

కొత్త హరిబాబుతో పాటు అతడికి పని మనుషులుగా, సహకరించిన మరో ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఢిల్లీలో హరిబాబును పోలీసులు పట్టుకోగా అక్కడే అతడికి సహకరించిన హైదరాబాద్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని సోమవారం తమదైన శైలిలో పోలీసులు విచారించినట్లు విశ్వసనీయ సమాచారం.

పోలీసులకు చిక్కకుండా ప్రాంతాలు మార్చి..

హత్య కేసులో నిందితుడిగా ఉన్న హరిబాబు, ఇద్దరు సహాయకులతో కలిసి ప్రాంతాలు మార్చి పోలీసులకు చిక్కకుండా ప్రయత్నించినట్లు సమాచారం. ఢిల్లీ, సిమ్లా, అమృత్‌సర్ లాంటి ప్రదేశాలను సందర్శించి చివరకు ఢిల్లీకి వచ్చి బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించే క్రమంలోనే పోలీసులకు చిక్కినట్లు తెలిసింది.

అటవీ జంతువులను వేటాడిన కేసులో ఐదుగురి అరెస్ట్

● వివరాలు వెల్లడించిన అటవీ అధికారులు




నిందితుల అరెస్ట్ చూపుతున్న ఫారెస్ట్ అధికారులు

ఖానాపురం: అటవీ జంతువులను వేటాడిన కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్ఓ రవి కిరణ్, డీఆర్ఓ రీనా తెలిపారు. ఈ మేరకు సోమవారం నర్సంపేట రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఖానాపురం మండలం చిలుకమ్మనగర్‌కు చెందిన మధు, సుమన్, పవన్ కుమార్, అశోక్ నగర్‌కు చెందిన యాకాంబ్రం, సురేశ్, కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెంకు చెందిన లవన్ కుమార్ (బాబురావు) ఆదివారం చిలుకమ్మ నగర్ అటవీ ప్రాంతంలో కొండెగొర్రె, కనుజులను వేటాడి నర్సంపేట వైపునకు ఆటోలో తరలిస్తుండగా రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్న విషయం విధితమే. ప్రమాద సమయంలో అటవీ జంతువుల మాంసం రోడ్డుపై పడేసి పరారీ కావడంతో విచారణ జరిపిన అధికారులు ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అశోక్ నగర్‌కు చెందిన యాకాంబ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

నెల క్రితం ఇంటి నుంచి వెళ్లి.. శవమై కనిపించి..

● వడదెబ్బతో వ్యక్తి మృతి



రాజు మృతదేహం

కేసముద్రం: నెల రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి.. సరైన ఆహారం లేక, వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఈ ఘటన కేసముద్రం మున్సిపాలిటీ పరిధి ముత్యాలమ్మగుడి సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. పెద్దవంగర మండలం ఉప్పరిగుడెం గ్రామానికి చెందిన దుంపల రాజు(48) నెలరోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో సోమవారం మున్సిపాలిటీ పరిధి ముత్యాలమ్మగుడి సమీపంలో వ్యక్తి మృతదేహం కనిపించగా స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతుడు పెద్దవంగర మండలం ఉప్పరిగుడెంకు చెందిన రాజుగా గుర్తించారు. సరైన ఆహారం లేక, వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విజయీభవ..

- 'పది' ఫలితాలకు ప్రణాళికే కీలకం
- బట్టీ విధానానికి స్వస్తి పలకాలి..
- పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు సబ్జెక్టు నిపుణుల సూచనలు



బట్టీ విధానం వదిలేయాలి



భాషాంశాలు, వ్యాకరణాంశాలపై 20 మార్కులు వస్తాయి. ఆయా పాఠ్యాంశాల వారీగా విభజించుకుని ఎక్కుసార్లు రాస్తూ చదవాలి. బట్టీ విధానం వదిలేయాలి. కవి పరిచయాలు చదివి క్షుణంగా గుర్తుంచుకోవాలి. పాఠ్యాంశంపై పట్టు సాధిస్తే 12 మార్కులు సాధించొచ్చు. వ్యాకరణంలో సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛంధస్సు అర్థాలపై అవగాహన పెంచుకుంటే అధిక మార్కులు సాధించే అవకాశం ఉంది.

– మద్దెర్ల రమేశ్, తెలుగు ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ (బాలికల), మహబూబాబాద్

గణితంలో సూత్రాలు గుర్తుపెట్టుకోవాలి



సమయం తక్కువ ఉన్న నేపథ్యంలో అభ్యస పుస్తకంలో ఎంపిక ప్రశ్నలు చదివితే చాలు. పార్ట్- ఏలో 12 మార్కులు రాయాలి. సెకండ్ బిట్‌లో 24 మార్కులు రాయాలి. గణితంలో బిట్స్‌కు 20 మార్కులున్నాయి. అందుకే ప్రతీ చాప్టర్ చదవాలి. సంఖ్యావ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖగణితం, తదితర అధ్యాయాలు చదువుతూ ప్రాక్టీస్ చేయాలి. సూత్రాలు రాయాలి. గుర్తుపెట్టుకోవాలి.

– ప్రతిభ, గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్ (బాలుర), మహబూబాబాద్

ఒత్తిడికి గురికా వద్దు



ఒక్కరోజే భౌతిక, జీవశాస్త్రాల పరీక్ష నిర్వహిస్తారు. జనరల్ సైన్స్ మొదటి గంటన్నర భౌతికశాస్త్రం, తర్వాతి గంటన్నర జీవశాస్త్రం పరీ క్ష ఉంటుంది. అన్ని పాఠ్యాంశాల్లో ఉన్న ప్రయోగాలు, పట్టికలు, భేదాలు, పటాలు క్షుణ్ణంగా చదవాలి. పటాలు, వాటి భాగాలు రాస్తే సులువుగా ఐదు మార్కులు వస్తాయి. బిట్స్‌కు 10కి, బొమ్మలకు 6 మార్కులు వస్తాయి. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి.

– దోలి గిరిజ, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్ (బాలికల), మహబూబాబాద్

హిందీని అర్థం చేసుకుని జవాబులు రాయాలి



పేరాగ్రాఫ్‌కు 20 మార్కులు కేటాయిస్తారు. హిందీ పార్ట్-ఏలో 60 మార్కులు ఉంటాయి. ప్రశ్నలు అర్థం చేసుకుని సమాధానాలు రాస్తే సరిపోతుంది. లేఖ, రచన, వ్యాసాలు, తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పార్ట్-బీలో వ్యాకరణాంశాలు ఉంటాయి. అన్ని ప్రశ్నలకు సమాధానం రాస్తే 20కి 20 మార్కులు వస్తాయి. ఒక్క మార్కుల సమాధానాలు తప్పనిసరిగా రాయాలి.

– రంజాన్ అలీ, హిందీ ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ (బాలికల), మహబూబాబాద్

సృజనాత్మకంగా ఆలోచించాలి



భౌతిక శాస్త్రంలో ప్రయోగశాల కృత్యం నుంచి ఒక వ్యాసరూపం సమాధానం రాయాలి. ఆమ్లాలు-క్షారాలు, హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి, కాంతిధర్మాలు, క్వాంటం సంఖ్యలు, బంధాలు, వాటి ఏర్పాటు, లోహ సంగ్రహణ దశలు, హైడ్రోకార్బన్‌లు, వాటి నిర్మాణలపై బాగా రాయాలి. సృజనాత్మకంగా ఆలోచిస్తూ సమాధానాలు రాయాలి.

– ఏర్రబోయిన మాధవి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్ (బాలుర), మహబూబాబాద్

స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా చూసుకోవాలి



కొట్టివేతలు లేకుండా పార్ట్ ఏ, బీ రాయాలి. డిస్కోర్స్‌లో ముఖ్యంగా ఏ–గ్రూప్ నుంచి సంభాషణ (కన్వర్జేషన్) డిస్క్రిప్షన్ (వివరణ) కొరియో గ్రఫీ, గ్రూప్–బీ నుంచి లేటర్, బయోగ్రాఫికల్ స్కెచ్, రిపోర్ట్ రైటింగ్ నుంచి ప్రశ్నలు ఎక్కువ వస్తాయి. పాఠ్యపుస్తకంలో ఏ.బీ, సీ రీడింగ్ ప్యాసేజెస్ పూర్తి అవగాహన, అర్థం చేసుకుని పరీక్ష రాస్తే 24 మార్కులు సాధించొచ్చు.

– గోడిశాల సంజీవ, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ (బాలికల), మహబూబాబాద్

ప్రతీ ప్రశ్నకు సమాధానం రాయాలి



సాంఘిక శాస్త్రంలో, మ్యాప్ పాయింటింగ్‌లో ఇండియా, వరల్డ్, తెలంగాణ పటాలు గీయడం రాయాలి. పుస్తకంలో ఉన్న ప్రతీ పాఠ్యాంశాల్లో ఉన్న పట్టికలు, గ్రాఫ్‌లు చార్ట్స్, ప్రతీ సమస్య ప్రశ్నను చదివి క్షుణంగా పరీక్ష రాయాలి. చిన్న ప్రశ్నలను వదలకుండా రాయాలి. పది పాయిట్ల వాయిజ్ పరీక్ష రాస్తే అధిక మార్కులు వస్తాయి. బిట్స్‌కు సమయం కేటాయించి రాస్తే 20కి 20 మార్కులు వస్తాయి.

– పసమతి రమ, సాంఘిక శాస్త్రం టీచర్, జెడ్పీహెచ్ఎస్ కంకరబోర్డు

దైవదర్శనానికి వస్తూ.. అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- ముచ్చర్ల క్రాస్ సమీపంలో ఘటన



సుశాంత్ (ఫైల్)



విజయ్ మృతదేహం

హసన్‌పర్తి: దైవదర్శనానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందగా మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి పరకాల-కిట్స్ కళాశాల ప్రధాన రహదారిలోని ముచ్చర్ల క్రాస్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన మేకల సుశాంత్(19), మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం పొక్కురు గ్రామానికి చెందిన తాండ్ర విజయ్(19), జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనా గ్రామానికి చెందిన సి.వర్ధన్ (18) స్నేహితులు. సుశాంత్ పరకాలలోని పాలిటెక్నిక్‌లో థర్డ్ ఇయర్ చదువుతుండగా, వర్ధన్ అదే కళాశాలలో పాలిటెక్నిక్ సెకండ్ ఇయర్ అభ్యసిస్తున్నాడు. విజయ్ మాత్రం పరకాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్నారు. వీరు ముగ్గురు అదే ప్రాంతంలోని బీసీ హాస్టల్ ఉంటూ చదువు కొనసాగిస్తున్నారు.

రాత్రి 9.30 గంటలకు హాస్టల్ నుంచి జాతరకు..


ఆదివారం రాత్రి 9.30గంటలకు సుశాంత్, విజయ్, సి. వర్ధన్ పరకాల నుంచి బైక్‌పై ఎర్రగట్టు జాతరకు బయలుదేరారు. సుశాంత్ బైక్ నడుపుతుండగా, విజయ్, వర్ధన్ వెనుక కూర్చున్నారు. వీరితో పాటు మరికొంత మంది విద్యార్థులు కూడా వారి వెంట తమతమ బైక్‌లపై జాతరకు పయనమయ్యారు. సుశాంత్ నడుపుతున్న బైక్ ముచ్చర్ల శివారులోని జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతానికి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.

ఆస్పత్రికి తరలింపు..

వెనుక నుంచి బైక్‌లపై వస్తున్న స్నేహితులు క్షతగాత్రులను 108లో ఎంజీఎం తరలించారు. అప్పటికే సుశాంత్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చికిత్స పొందుతూ విజయ్ సోమవారం తెల్లవారు ప్రాణాలు వదిలాడు. వర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడు సుశాంత్ తండ్రి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● ఎలుకుర్తి క్రాస్ వద్ద ఘటన




వినయ్(ఫైల్)

మడికొండ/చిల్పూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మడికొండ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలం నష్కల్‌కు చెందిన చెగొండి వినయ్(22) తన స్నేహితుడు మామిండ్ల అరవింద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పెద్దపెండ్యాల నుంచి ధర్మసాగర్ వైపునకు వస్తుండగా ఎలుకుర్తి క్రాస్ వద్ద బొలెరో ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అరవింద్ తీవ్ర గాయాలతో ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్, చిల్పూరు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు.

బకెట్‌తో నీరు తోడుతూ..

- సంపులో పడి యువతి మృతి
- రాజవరంలో ఘటన



స్వాతి (ఫైల్)

చిల్పూరు: బకెట్‌తో నీరు తోడుతుండగా సంపులో పడి ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని రాజవరంలో జరిగింది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సామల స్వాతి (21) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బకెట్‌తో సంపులో నీరు తోడుతోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమవారం తెలిపారు.